క్లుప్తంగా

78 మందికి వైద్య సేవలు



కుసుమరాయి గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం : స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో కుసుమరాయి గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 78 మందికి వైద్య సేవలు అందించారు. వైద్యులు శ్వేత, హెచ్‌వీ విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు సుబ్బలక్ష్మి, పద్మప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ సుకన్య, 104 సిబ్బంది మహేష్, సతీష్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: భగత్‌సింగ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని గిరిజన సంఘం నేత బాలదేవ్ తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, రామన్న, రామారావు గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన

కొయ్యూరు: ప్రతి సచివాలయం పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పించినట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. రాజేంద్రపాలెం సచివాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరు కోడ్ ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. మండలంలోని 23 సచివాలయాల్లో శనివారం కార్యదర్శులు, వలంటీర్లు, ఇతర అధికారులతో సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని తెలిపారు.

చిరు గాలులతో వర్షం



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

కొయ్యూరు/రాజవొమ్మంగి: జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల్లో అరగంటపాటు చిరుగాలులతో వర్షం పడింది. ఈ వర్షం వేసవి పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

ఎరువులు, పురుగు మందులపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనర్ త్రివేణి

రాజవొమ్మంగి : రైతులు పంట పొలాల్లో ఉపయోగించే రసాయన ఎరువులు, పురుగుమందులపై అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనర్ త్రివేణి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి ఇంగ్లిష్‌మీడియం విద్యార్థినులను ఆమె రాజవొమ్మంగిలోని వివిధ ఎరువుల దుకాణాలకు తీసుకువెళ్లారు. అక్కడ లభించే ఎరువులు, ఏయే పంటకు ఎంత మోతాదులో వేస్తారు తదితర విషయాలను వివరించారు. ప్రకృతి సేద్యం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు.

సవాళ్లను అధిగమించి ఎన్నికల నిర్వహణ

- ఐఏఎస్ శిక్షణ పూర్తయిన తరువాత తొలి పోస్టింగ్ ఇక్కడే
- ఆర్వోగా ఇవే మొదటి ఎన్నికలు
- భౌగోళికంగా సంక్లిష్టమైన నియోజకవర్గం
- కౌంటింగ్ కోసం సీఈవోకు ప్రతిపాదనలు
- రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్

సాక్షి ఇంటర్వ్యూ



అసెంబ్లీ నియోజకవర్గం : రంపచోడవరం	
మొత్తం ఓటర్లు 2,73,970	పురుష ఓటర్లు 1,30,772
మహిళా ఓటర్లు 1,40,183	ఇతరులు 15
సెక్టోరియల్ అధికారులు : 59	సిబ్బంది 6,000
పోలింగ్ బూత్‌లు : 399	

రంపచోడవరం: భౌగోళికంగా సంక్లిష్టంగా ఉన్న రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలే... అయినా అధిగమించి, ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొండలు, గట్టలు, దూరంగా ఉండే పోలింగ్ కేంద్రాలు, మరో వైపు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో ఎన్నికల నిర్వహణను ఓ చాలెంజ్‌గా తీసుకోవడం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చని రంపచోడవరం నియోజకవర్గం ఆర్వో, సబ్ కలెక్టర్ యువ ఐఏఎస్ అధికారి ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు విషయాలపై 'సాక్షి'తో మాట్లాడారు. ఐఏఎస్ శిక్షణ పూర్తయిన తరువాత రంపచోడవరంలో తనకు సబ్‌కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ లభించిందని చెప్పారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల సమయంలోనే శిక్షణ పూర్తి చేసుకుని, విధుల్లో చేరడం, ఆర్‌వోగా విధులు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించడం ఇదే మొదటి సారి అని ఆయన చెప్పారు.

బోట్లు, హెలికాప్టర్‌లో ఈవీఎంలు తరలించాలి

రంపచోడవరం నియోజకవర్గంలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు చాలా ఉన్నాయి. వీఆర్ పురం మండలం తుమ్మిలేరు పోలింగ్ కేంద్రానికి బోటు ద్వారా ఈవీఎంలను తరలించాలి. ఈవీఎంల పంపిణీ కేంద్రం నుంచి పోచవరం వరకు వాహనంలో తీసుకువచ్చి అక్కడ నుంచి బోటులో తరలించాలి. గుర్తేడు,పాతకోట ప్రాంతాల్లో పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను హెలికాప్టర్ ద్వారా స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చాలి. ఈ నియోజకవర్గంలో రోడ్డు, జల, వాయు మార్గాలను వినియోగించాల్సి వస్తుంది. అతి సమస్యాత్మ, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. అక్కడ ఎక్కువ మంది పోలీసులను బందోబస్తుకు వినియోగించి, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం.

విసిరేసినట్టు గ్రామాలు

ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రకారం ఓటరు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వెళ్లి ఓటు వేసే పరిస్థితి ఉండకూడదు. జిల్లాలో విసిరేసేటట్టు అక్కడక్కడ ఉండే గ్రామాలు అనేకం ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆలోచన చేస్తున్నాం. ఎన్నికల నిర్వహణ కోసం ఐదు వేల మంది ఉద్యోగులను వినియోగిస్తున్నాం. ఒక్కో పోలింగ్ బూత్‌లో సుమారు ఆరుగురు ఎన్నికల విధులు నిర్వహిస్తారు.

వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా..

ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు 85 సంవత్సరాలు పైబడిన వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పోలీసులు, ఎన్నికల సిబ్బంది పర్యవేక్షణలో వృద్ధులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇలా ఓటు హక్కు వినియోగించుకునే వారు సుమారు 350 మంది ఉండవచ్చని అంచనాకు వచ్చాం.

ఈవీఎంలు తరలించడమే పెద్ద చాలెంజ్

ఎన్నికలు పూర్తయిన తరువాత ఈవీఎంలను పాడేరులో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం పెద్ద చాలెంజ్. రంపచోడవరం డివిజన్ నుంచి ఈవీఎంలు తరలించాలంటే ఐదు గంటల సమయం పడుతుంది. అదే చింతూరు డివిజన్ నుంచి అయితే పది గంటల సమయం పడుతుంది. ఎన్నో భద్రతా పరమైన సమస్యలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని రంపచోడవరంలోనే కౌంటింగ్ నిర్వహించేందుకు సీఈవోకు ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం వస్తే ఇక్కడే కౌంటింగ్ జరుగుతుంది.1999లో ఇక్కడే కౌంటింగ్ జరిగినట్టు రెవెన్యూ అధికారుల ద్వారా తెలిసింది.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవు. ప్రతి మండలంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో టీమ్‌లు పర్యవేక్షణ చేస్తున్నాయి. పంచాయతీ స్థాయిలో కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. పార్టీల ప్రచారంపై వీడియో తీస్తాం. ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు నిర్ధారణ అయితే వెంటనే విధుల నుంచి తొలగించడం జరుగుతుంది.

ఓటు నమోదుకు అవకాశం

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. రెండు డివిజన్లలో దాదాపుగా అన్ని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలన పూర్తయింది. 399 పోలింగ్ స్టేషన్‌ల్లో పూర్తి స్థాయి లో వసతులు కల్పించాం. రంపచోడవరం నియోజకవర్గంలో 2,73,970 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,30,772 మంది పురుష ఓటర్లు, 1,40,183 మహిళ ఓటర్లు, 15 మంది ఇతరులు ఉన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్,ఫర్నీచర్ ఉండేటట్లు చర్యలు తీసుకున్నాం. 59 మంది సెక్టోరియల్ అధికారులతో పక్కా ప్రణాళికతో ఎన్నికలను సమర్థంగా నిర్వహిస్తాం.

ఓటర్లలో చైతన్యానికి సంతలో ప్రచారం



ముంచంగిపుట్టు వారపు సంతలో ఓటర్లను చైతన్యపరుస్తున్న యూనివర్స్

ముంచంగిపుట్టు: ఓటర్లను చైతన్య పరిచేందుకు అరకువేలికి చెందిన విశ్వ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యూనివర్స్ శనివారం ముంచంగిపుట్టులో జరిగిన సంతలో వినూత్నంగా ప్రచారం చేశారు. మన ఓటు–మన జీవితం అంటూ బ్యానర్ పట్టుకుని, చేతిలో మైక్‌తో ఓటర్లను చైతన్యవంతులు చేసే ప్రయత్నం చేశారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేద్దాం, మత్తును కలిగి ఓటు వేయడానికి రావడం మంచిదికాదు, పోలీసులకు ,ఎన్నికల సిబ్బందికి సహకరిద్దాం అంటూ మైక్‌లో చెబుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

పెదబయలు: మండలంలోని ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు బొండా సన్నిబాబు కోరారు. మండలంలోని సీతగుంట పంచాయతీలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో శనివారం ఆయన మాట్లాడారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటోందని టెంట్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉంచాలని, ఉపాధి కూలీకు వారం వారం వేతనాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధరం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

చింతపల్లిరూరల్: స్థానిక ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు సారె సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఆలయ కమిటీ సభ్యులు వీరేంద్ర, పసుపులేటి వినాయకరావు, దురియా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న సమావేశం

ముత్యాలమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఈ నెల 25న సమావేశం నిర్వహించనున్నట్టు స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఉత్సవ తేదీలు నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయపార్టీలు నిబంధనలు తప్పక పాటించాలని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. వివిధ పార్టీల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ , సి.విజిల్, సువిధా తదితర వాటి గురించి వారికి వివరించారు. నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- జగ్గంపాలెం, జియ్యంపాలెం నుంచి వైఎస్సార్ సీపీని ఎవ్వరూ వీడ లేదు
- టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది



జగ్గంపాలెంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ పద్మావతి

గంగవరం: రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, రంపచోడవరం ఎమ్మెల్యేగా ధనలక్ష్మి ఘనవిజయం సాధిస్తారని సూరంపాలెం ఎంపీటీసీ కుంజం పద్మావతి, జగ్గంపాలెం, జియ్యంపాలెం సర్పంచ్‌లు తుర్రం లీలావతి, చోడి బుల్లాబ్బాయి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ దొర ధీమా వ్యక్తం చేశారు. శనివారం జగ్గంపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జగ్గంపాలెం, జియ్యంపాలెం పంచాయతీలకు చెందిన 400 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరినట్టు టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేశారన్నారు.టీడీపీ నాయకులు వారి కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ పార్టీలో చేరారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

ఇక్కడ ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడు గాని, కార్యకర్తగాని టీడీపీలో చేరలేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను మానుకోకపోతే ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కుంజం శ్రీనివాస్ దొర, మండల రైతు కార్యదర్శి కంగల వెంకటరావు, మాజీ సర్పంచ్ చెడెం రామారావు దొర తదితరులు పాల్గొన్నారు.

బాల బడుల్లో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



యూనిఫామ్స్,బ్యాగులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న శ్రీను

జి.మాడుగుల: జిల్లాలో చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల బడుల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లు, చెప్పులు, స్కూల్ బ్యాగ్‌లు, టోపీలు, స్టడీ మెటీరియల్స్, మిఠాయిలు, బొమ్మలు శనివారం పంపిణీ చేశారు. పెద్దపార్లు,మూగమర్రి బంగారుబూడి, కొత్త పెదబయలు, చింతలూరు, భీమునిపనుకు, బర్సింగిమెట్ట, తోకరాయి, పూతికిమెట్ట గ్రామాల్లోని బాలబడుల్లో పిల్లలకు ఎన్టీపీసీ,శ్రీనివాస్ ఫార్మ్స్, శారద మెటల్స్,శ్రావణ్ షిప్పింగ్, ఆర్‌హెచ్ఐ మాగ్నేసిటీ, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సహకారంతో వీటిని పంపిణీ చేసినట్టు సంస్థ కార్యదర్శి గాడి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీదరి శ్రీనివాసరావు, బాల బడుల సూపర్ వైజర్ కిల్లో భాస్కర్, సిబ్బంది నాగబాబు, చిన్నారావు, జగ్గారావు, రాధ, మోహన్ బాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ముంచంగిపుట్టులో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది



కూనవరంలో క్షయవ్యాధి నిర్మూలనపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



రాజేంద్రపాలెంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



సప్పర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



రాజవొమ్మంగిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ముంచంగిపుట్టు: క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక వారపు సంతలో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే అన్ని రకాల మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కిలగాడ,లబ్బూరు సీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కూనవరం, కూటూరు వైద్యాధికారులు డాక్టర్ సునీల్ కుమార్, శ్రీనివాస్‌మూర్తి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కూనవరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి సచివాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో టీబీ అంతం మన పంతం అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, అలసట, బరువుతగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారిని క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు గుర్తించి, వెంటనే పీహెచ్‌సీకి తీసుకువస్తే పరీక్ష చేసి మందులు అందజేస్తారని తెలిపారు. టీబీని సమాజం నుంచి పారదోలడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆర్.రామాంజనేయులు, హెచ్ఎస్ శ్రీనివాస్‌రావు, హెచ్‌వీ సీతమ్మ, ఎస్‌టీఎల్ఎస్ భారతీ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.

గూడెంకొత్తవీధి: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సప్పర్లలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు ప్రసన్నకుమార్, సందీప్, సిబ్బంది అశోక్, నానాజీ, కిషోర్, శివ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : క్షయ వ్యాధిపై అందరికీ అవగాహన అవసరమని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నాగార్జున, డాక్టర్ సుష్మా అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా శనివారం రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించి, క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, ఎంపీహెచ్ఎస్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, హెచ్వీలు లక్ష్మమ్మ, రమాబాయి, ఎంఎస్‌వో గోపి, ఎల్టీలు వెంకటలక్ష్మి, తమ్మారావు పాల్గొన్నారు.

పవనగిరిలో శని త్రయోదశి పూజలు



నవగ్రహారాధన చేస్తున్న భక్తులు




రంపచోడవరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అడ్డతీగల: శని త్రయోదశి సందర్భంగా పవనగిరి క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు, శనీశ్వరునికి తైలాభిషేకం, పుష్పారాధన జరిపారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో లంకా అయ్యప్పశర్మ పూజలు చేయించారు. అనంతరం వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు.

రంపచోడవరం: స్థానిక సంత మార్కెట్ రోడ్డులో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ మండపం వద్ద శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. లింగాల సీతారామాంజనేయశర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక నారాయణ గిరిపై కొలువైన వేంకటేశ్వరస్వామిని, ఐ.పోలవరం గోవిందగిరిపై గల వేంకటేశ్వరస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



అంతర్లలో గ్రామస్తులకు అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని అంతర్లలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కవడం రామ్ ప్రసాద్, కవడం ఈశ్వరావు, కొరాబు చెలి పడాల్, కొత్తన్నదొర, మొట్టడం రామారావు, సత్యవతి, సోమరాజు, శివసంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 12 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి : మండలంలో శనివారం జరిగిన పదవ తరగతి పరీక్షలకు 12 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులు, 9 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. మొత్తం 458 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 446 మంది హాజరైనట్టు చెప్పారు.

వాతంగిలో ఫ్యామిలీ డాక్టర్



వాతంగిలో నిర్వహించిన వైద్యశిబిరం

రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 45 మందికి వైద్యసేవలందించినట్టు జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యామిని ప్రియ తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశామని ఆమె చెప్పారు. హెచ్‌వీ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

28న ప్రసన్న విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

అడ్డతీగల: మండల కేంద్రం అడ్డతీగలలో ఇటీవల పునర్ నిర్మించిన శ్రీ ప్రసన్న విఘ్నేశ్వర ఆలయంలో విఘ్నేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ కన్వీనర్ వంకా రాము తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహిస్తామన్నారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక సిరిగిందలపాడులో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మిషన్ కార్యదర్శి స్వామి పరిజేయానందజీ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు నిర్వహించే వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలందిస్తామని తెలిపారు.

అండర్ పాసింగ్ వంతెన నిర్మాణానికి వినతి



సెక్షన్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దూరు గ్రామస్తులు

అనంతగిరి: మండలంలోని బొర్రా పెద్దూరు గ్రామానికి అండర్ పాసింగ్ వంతెన నిర్మించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (వర్క్స్) శివప్రసాద్‌ను పెద్దూరు గ్రామ పెద్దలు కోరారు. బొర్రా రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దూరు గ్రామానికి రాకపోకలు సాగించాలంటే నిత్యం మూడు రైల్వే ట్రాక్‌లు దాటవలసి వస్తోందని, దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పూజారి రఘురాం, రాము, సింహాద్రి, రాంబాబు తదితరులున్నారు.